# మినీ కథ :

## బుస

పసుమర్తి వేణుగోపాలరావు



"అమ్మాయీ! ఉత్తరాలు!!" అని పిలవగానే వచ్చి తీసుకుంది రమ.

"ఈయనగారు ఎప్పుడు రాస్తూవుంటారోగానీ, వారం వారం వస్తూనే వుంటాయి. వెధవది కలం స్నేహాలమ్మా. ఖర్మ!"

అప్పుడు మా అమ్మాయి ముఖం చూస్తే ఏదోలా అనిపించింది. "ఏమీ" లేకపోతే అలా ఎందుకుంటుంది? ఈ ఐదారు నెలల్లో ఎందుకీ మార్పు.?

"రమా. మీ ఆయన ఈ మధ్య నిన్ను సరిగ్గానే చూసుకుంటున్నాట్టే?" మా అమ్మాయికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. చెప్పలేక చెప్పింది.

"ఎవరో ఇద్దరు ఆడపిల్లలతో కలం స్నేహం కబుర్లు వారి వారి లీలలు!"

ఈ మగబుద్ధి నాకు తెలియనిదికాదు. ఇంట్లో ఎంత రుచికల పదార్థాలు దొరుకుతున్నా, హోటళ్ళ మీదకి, చిరుతిళ్ళమీదకి దృష్టి మళ్ళిస్తూనే వుంటారు.

"నీది అనుమానమేనేమోనే" - తేల్చుకోవాలనే అడిగాను.

"లేదమ్మా - వాళ్ళు ఏవిటేవిటో రాసుకుంటూ వుంటారు. ఆ మెడికల్ పిల్ల మరీనూ"- అంటూ ఒక వుత్తరం తెచ్చి నా ముందుంచింది. నాలోని తల్లి ప్రాణం తల్లడిల్లిపోయింది. సంగతి అర్థమైంది.

"ముందునుంచే జాగ్రత్తపడితే ఇంత వరకూ వచ్చేదికాదేమోనే -" అన్నాను. అంతకంటే ఏమనాలో అప్పటికి తోచక.

"ఒక రోజంతా భోజనం మానేశాను. ఆయనగారు పట్టించుకోలేదు. మెల్లగా అడిగితే కస్సు బుస్సు లాడారు - ఇదంతా నాఖర్మ." దాని బాధ నాకు తెలుసు ముద్దుగా పెరిగిన పిల్ల. మొదట్నించికూడా దేనికీ తట్టుకోలేని పసి హృదయం. అయినా, పాపం కాపరానికొచ్చి ఎంతకాలమైందని? అనురాగం పెరిగితే అధికారం తీసుకో వచ్చునేమోగానీ, అప్పుడే అంత చనువు ఎక్కడనుంచి వస్తుంది రమకి. సున్నితమైన విషయాలు జాగ్రత్తగానే చూసుకోవాలి. లేకపోతే తుపానుకు దారితీస్తే -

ఎలాగైనాసరే - ప్రయత్నం చేద్దాం అనే నిర్ణయించుకున్నాను.

రెండు రోజుల తర్వాత క్యాంపునుంచి తిరిగి వచ్చాడు రమానాధుడు. పైకి కులాసాగానే వున్నాడు ఎక్కడో వుండే ఎవరో అమ్మాయితో ఏవేవో వూహించుకుంటూ కాలం గడపటం వయస్సు తెచ్చిన వట్టి కుర్రచేష్టలేనేమో; అయినా, తన సర్వస్వమని నమ్ముకున్న దేవుడిని. ఏ ఆడది గాలికి వదిలివేస్తుంది? "ముప్పైఏళ్ళు కాపరం చేసినా, భార్య మనసు తెలుసుకోవటం బ్రహ్మతరం" అన్నాడో మగ రచయిత. నాకు తెలుసు మా రమ పడుతున్న మూగ వేదన.

మా రమకు "ముగ్గులు కమ్ పిండి వంటలు" పుస్తకం వుంది. ఆ పుస్తకంలో మా అల్లుడికి వచ్చిన వుత్తరాలన్నీ వుంచి రేడియోమీద పెట్టాను. ఉత్తరాలు తీసుకుంటూ పుస్తకం లోపలికి చూస్తాడుగదా; అక్కడే వుంది విషం!

భోజనం తర్వాత కిళ్ళీయిస్తూ చెప్పింది రమ "లవ్ లెటర్ల" సంగతి. రమానాధుడు ఎగిరి గంతువేసి, పుస్తకం తొందరగా తిప్పాడు. నేనూ, మా రమా అతని ముఖంలోని ఫీలింగ్స్ చూస్తున్నాం. ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మైండ్. సరిగ్గా కవరు తీసుకున్న పేజీలో వ్రాసినది చదువుతూ ఆగిపోయాడు. ముఖంలో అశాంతి కనబడింది. తేలుకుట్టిన దొంగముఖం ఎలా వుంటుందో ప్రత్యక్షంగా కళ్ళముందు కనబడులోంది. దీనికి కారణం-నేనా పేజీలో మా అమ్మాయి చేత నాలుగు ఎడ్రసులు ఇతనికంటే గొప్ప హోదాలో వున్న వాళ్ళ పేర్లు - హాబీలు వగైరాలు వ్రాయించాను. వారందరికీ రమ అప్పుడప్పుడు వుత్తరాలు వ్రాస్తున్నట్లు అర్థం వచ్చేటట్లుగా పాత తారీకులు, వారి దగ్గరనుంచి వుత్తరాలు అందుకున్నట్లున్నూ ప్రక్కనే గుర్తులు వేయించాను.

అతను చేసేది కలం స్నేహం; ఇదీ అంతే; హద్దులు దాటినా, మరొకరి మనసు కష్టపెట్టినా - "ఇది తప్పేనని అల్లుడు తెలుసుకుంటాడా!". భార్య మరొక మగవాడితో కలం సంబంధం పెంచుకొనేట్లయితే పురుషుడి మనస్సు ఎలా సహించగలుగుతుంది? స్త్రీ. పురుషుల మధ్య బాంధవ్యం ఎంతో సున్నితంగా కాపాడుకోవాలి - ఇలా ఆలోచిస్తూ వున్నాను రాత్రి - రేడియోలో సంగీతం వింటూ.

"రమా" అని పిలుస్తూ, అల్లుడు బెడ్ రూములోకి వెళ్ళాడు.

ఉదయం గమనించాను రమకళ్ళల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని. 'అమ్మా! ఆ వచ్చిన వుత్తరాలు చదవకుండానే చింపి కిటికీలోనుంచి బయటకు పారేశారమ్మా" అంటూ సిగ్గుపడిపోయింది మా తల్లి.

మనిషిని మార్చటానికి "కాటు వేయనవసరంలేకుండా కూడా. కొన్ని కొన్ని సమయాల్లో కేవలం "బుసకొట్టడం చాలు" అనిపించింది ఆ క్షణాన. ★

